పోయేడు. రాజేశ్వరి తడుస్తోనే క్రిందికిదిగి వెళ్ళిపోయింది. పదినిముషాలలో ఫ్లాస్కు, ఆకుపొట్లాంతో పైకి వచ్చింది. తడిసిన బట్టలు ఆమె విప్పనేలేదు! జుత్తంతా తడిసి నుదుటికి అంటుకపోయి వుంది.

"అరరే! మీాకేమన్నా పిచ్చా! ఇప్పుడెందుకు ఇవన్నీ?" అని గాభరాగా అన్నాడు జయపాలు. ఆమెని అనరానిమాటలు అని, ఆమె స్త్రీత్వాన్నే గాయపరిచాడు! అయినా, ఇప్పుడు ఆమె తన క్షుధార్తిని తీర్చటానికి తడిసి పోయి వచ్చింది.

"తీసుకోండి!" కిటికీ రెక్కని ఆనుకుని ఒంపుగా నిల్చుని, కిటికీలోంచి ఎలక్ట్రిక్ లైటు కాంతి పడేచోట, తెగిన జలతారు దారాల్లా మెరుస్తోన్న వర్షపుచినుకుల్ని చూస్తో అంది ఆమె.

"వాన తగ్గాక నేను భోజనానికి వెళ్తాను కదా! ఇంతలో ఎందుకు మళ్ళీ?" అన్నాడు మొహమాటపడుతూ జయపాలు.

"ఇవ్వాళ ఈ వర్షం తగ్గదు. మీారు హోటలుకు పోవటానికి బద్ధకిస్తారు. నాకు తెలుసు!" ఆమె అంది. జయపాలు ఏమీా అనలేదు. ఫ్లాస్కులో వున్న బోర్న్‌విటా గ్లాసులోనికి వొంపాడు. ఆకులోవున్న చపాతీ కూరని ఆప్యాయంగా తిన్నాడు. వేడి వేడి బోర్న్‌విటా కడుపులోనికి జారేసరికి అతనికి ఒక్కసారిగా ఆమె తడిబట్టలతో ఉండిపోయిన విషయం గుర్తుకువచ్చింది.

నిన్ను చూడగానే నాకు ముచ్చటేసింది. నీకు మా రాజేశ్వరికి ఈడూ జోడూ బాగుంది. ఇద్దరూ ఒకచోట ఉంటే రతీ, మన్మథుల్లా ఉంటారు అనిపించింది. నీకు నాలుగు వందల రూపాయల జీతం వచ్చే ఉద్యోగం ఉంది. నీ స్టేటస్‌కి పదిహేనువేల రూపాయల కట్నం వస్తుంది. మీ నాన్నగారి దగ్గరికి వెళితే మాకు నిరాశ ఎదురయింది. నువ్వు నచ్చావు. నీ స్టేటస్ నచ్చింది. కాని మాకా తాహతు లేదు. ఇలా మే మిద్దరం బాధపడుతూంటే, శంకరంగారూ మాకో సలహా ఇచ్చేరు. సహజంగా యువకులకి 'సింపతీ' ఉత్పన్నమైతే దానికోసం ఎంతటి తెగింపయినా చేస్తారు అని అన్నారు శంకరంగారు. ఆయన వేసిన ప్లాను ప్రకారం నీవు వాళ్ళ ఇంటిలో అద్దెకు వచ్చిన మర్నాడే మా అత్తయ్యమావూరు వెళ్ళిపోయింది. రాజేశ్వరిని తీసుకొచ్చాం! ఆయన మూడో పెళ్ళి భార్యకింద, నీ సానుభూతిని సంపాదించుకునేట్లు చేశాం. బాబూ. మేము ఈ నాటకం ఆడి నిన్ను మోసం చేశాము. కాని ఈ మోసం క్రింద ఒక తీయని కన్నెమనసు కలవర పాటుని నీవు గ్రహించుకో గలుగుతావా? ఇది అంత క్షతవ్యం కాని నేరమా! నేను నీతో, రాజేశ్వరిని గూర్చి చాలా రెక్లస్‌గా మాట్లాడేవాడిని! ఒకళ్ళు ద్వేషిస్తోన్నట్లు కన పడితే అనుకోకుండానే ఆ వ్యక్తిని మనం ఆరాధిస్తాం. నేను రాత్రుళ్ళు రాకుండా వుండేవాడిని. కాని నీవు అనుకున్నట్లు అల్లరిగా ప్రవర్తించే వాడిని కాదు. ఇంకో పేటలో నా భార్యా, పిల్లలూ వున్నారు. అక్కడికి వెళ్ళిపోయేవాడిని. నీకు ఇదంతా వింతగా కన్పించుతోందా? ఈ నాటకం ఆడ

టానికి రాజేశ్వరి ఎంత భయపడిందో నీకు తెలీదు. ప్రతి క్షణం భయంతో కుమిలి, కుమిలి ఏడ్చేది. జయా! మా నేరం క్షంతవ్యం కాదంటావా? నీ క్షమాభిక్షకు వేచివున్నాం—

నీ

రామం"

"ఒక్కసారి వెనక్కి తిప్పి ఇంటికి పోనీయి" అన్నాడు జయపాలు రిక్షావాణ్ణి.

"బండికి టయిమయిపోనాది బాబూ!" అన్నాడు రిక్షావాడు.

"ఇవ్వాళ కాకపోతే రేపు వెళతాలే ముందు ఇంటికి పోనివ్వు!" అన్నాడు జయపాలు.

తిరిగి రిక్షా యింటికేసి రావటం చూసిన శంకరంగారు ఆనందంతో...

"రాజీ!" అంటూ గట్టిగా కేక పెట్టాడు.